# దానం

సముద్రపు గాలి మెల్లగా వీస్తోంది. ఉదయ సూర్యుని ఎండ చల్లగా ఉంది.

వెనక సీట్లో పిల్లలు చేసే అల్లరిని మిర్రర్‌లో నుంచి చూస్తున్నాను. నా శరీరం, మనసు ఆనందంతో తేలిపోతున్నట్లుంది. ఎప్పుడూ చూసే పిల్లలే అయినా యిపుడు వాళ్ళు కొత్తగా, అందంగా వున్నారు. రోజూ చిరాకు పర్చే వాళ్ళ అల్లరి యివాళ గర్వాన్ని, సంతోషాన్ని కలుగ జేస్తోంది.

విండో అద్దాన్ని మాటి మాటికీ పైకెత్తి కిందికి దింపుతూ రవి దానితో ఆడుకొంటున్నాడు. రేడియో విన్పించే పాటకు అనుగుణంగా మెత్తటి సీటుపైన ఎగురుతూ సోము స్ప్రింగ్ ఏక్షన్ సౌఖ్యాన్ని తనివి తీరా అనుభవిస్తున్నాడు. మరో వైపు విండోలో నుంచి కళ్యాణి ప్రాతః కాలపు నగర సౌందర్యాన్ని చూస్తోంది. ఎగిరెగిరి పడ్తున్న జుట్టును మాటి మాటికీ వెనక్కి సర్దుకుంటుంటే నాకో సినిమా తార గుర్తుకొచ్చింది.

ముందు సీట్లో నా పక్కన కూర్చున్న లత వైపు క్రీగంట చూచాను. ఎదురుగావున్న అద్దంలో నుంచి తన్మయత్వంతో చూస్తోంది. ఖరీదైన కారులో నుంచి చూస్తే రోజూ చూచే దృశ్యాలు కూడా అందంగా కన్పిస్తాయని నాకు తెల్సు.

నలుగురి మొహాల్లోనూ సంతోషం వురకలేస్తోంది. అందరి పెదిమల పైన తృప్తితో కూడిన నవ్వు తళుక్కుమంటోంది. ప్రపంచాన్ని జయించామన్నంత తృప్తి, నవ్వు!

కారులో వెళ్ళటం నాకు నడకంత సహజం. నా జీవితంలో అధిక భాగం కారుల్లోనే గడిచిపోయింది. అందుకే నాకు కారు ఎక్కడం అంటే బోరుకొడ్తుంది. నడవటం అంటే నాకు మహా సర్దా!

అయినా యివాళ కారు ప్రయాణం నాకు చాలా ఆనందంగా వుంది. నా భార్య, పిల్లలు కారులో వున్నారు. వారు పొందుతున్న ఆనందం చూస్తుంటే నేను ఎంత పొరపాటు చేశానో అర్థమవుతోంది. నా సర్దాలు, సంపాదనే చూసుకున్నాను కాని వారి సర్దాలను గురించి ఏనాడైనా ఆలోచించానా ?

"ఇప్పుడు ఎక్కడికి పోతున్నాం నాన్నా ?" రవి అడిగేడు నా వైపు చూస్తూ.

అవును. ఎక్కడికి పోతున్నాం ? నాకే తెలియదు. కాసేపు కార్లో అందరినీ తిప్పి మళ్ళీ యింటి దగ్గర దింపటం నేననుకొన్న ధ్యేయం.

"అప్పుడే యింటికి వెళ్తున్నామా ?" సోము మొహంలో ఆనందం, నవ్వు క్షణంలో మాయమయ్యాయి.

నిజానికి కారు యింటి వైపు వెళ్ళటంలేదు. ఇంటికి చాలా దూరంగా ఎక్కడో రోడ్డు మీద వెళ్తోంది. అయితేనేం ? గట్టిగా తల్చుకొని డ్రైవ్ చేస్తే యిరవై నిముషాల్లో యిల్లు చేర్తాము. అందరి మొహాల్లోని ఆనందం, నవ్వు మాయమవుతోంది.

నో! అలా కావటానికి వీల్లేదు. నా భార్యా పిల్లల ఆనందాన్ని చూస్తుంటే నాకు ఎప్పుడూ పొందని సంతోషం....తృప్తి కలుగుతోంది. వారికొక్కవల్సిన సంతోషం వారికిచ్చి యీ కొత్త సంతోషాన్ని నేను

యివాళ తనివితీరా పొందాలి. కుటుంబ వ్యవస్థలో ఎంత మాధుర్యం వుంది?

నేను జేబులు తడుముకున్నాను. డబ్బు పుష్కలంగానే వుంది. ఆ డబ్బు వేరే ప్రయోజనానికి నిర్దేశించబడింది. అయితేనేం ? నా భార్యా పిల్లల ఆనందం కన్నా ఎక్కువా ? వారు వూహించని విధంగా వారిని సంతోషపెడ్తాను. ఒక్కరోజు....కనీసం ఒక్కరోజు వారికోసం నా కాలాన్ని, డబ్బును వెచ్చించకపోతే ఎలా ?

"ఊహూఁ. ఇంటికి వెళ్ళేది రాత్రికే. ఈ లోగా ఎక్కడికి తీసికెళ్తానో మీరే చూస్తారుగా ?"

పిల్లలు ఆనందంతో తల మునకలై చప్పట్లు కొట్టేరు.

"ప్రస్తుతానికి వో పెద్ద హోటల్‌లో టిఫిన్ చేయటానికి వెళ్తున్నాం".

కారు ఆపేను. నా భార్యా పిల్లల్తో హుందాగా హోటల్లోకి నడిచేను. అది ఎంత ఖరీదైన హోటలో నాకు తెల్సు. కానీ నేను అంతకైనా ఖరీదైన వ్యక్తిగా నటించగలను. నటన నా వృత్తి.

తెల్లటి దుస్తులు వేసుకొన్న అటెండర్ మా కోసం ఎ. సి. రూం తలుపులు తెర్చిపట్టుకొని నాకు "బో" చేసేడు. హుందాగా తల ఆడించి భార్యా పిల్లల్తో లోపలికి ప్రవేశించాను.

"అబ్బ. ఎంత బాగుందో!" స్వర్గంలో ప్రవేశించినంత ఆనందంతో అరిచేడు రవిగాడు. మెనూ కార్డు చూచి వెయిటర్‌కు ఖరీదైన అయిటమ్స్ ఆర్డర్ చేస్తూ చాలా గొప్ప థ్రిల్ ఫీలయ్యాను!

* * *

హోటల్లో తిన్న పదార్థాల రూపు రేఖ లావణ్య రుచుల్ని వర్ణిస్తూ గొప్ప గర్వంగా మాట్లాడుతున్నాడు రవి. హోటల్ అందచందాలు, డాబుదర్పాలు, వెయిటర్ల పర్సనాలిటీ, వాళ్ళ డ్రెస్, గాజుపాత్రలు, స్పూనులు, ఫోర్కులు....సోము సబ్జెక్టులయ్యాయి.

"ఏమండీ! బిల్లెంత అయింది ? ఎందుకండీ అనవసరంగా అంత ఖర్చు?" లత అలా అనటం అయిదోసారి. "ఆడవాళ్ళింతే. ఖర్చు పెట్టక పోతే పెట్టలేదంటారు. రెండు నాలికల మనుష్యులు" అనుకొని నవ్వు కొన్నాను నేను.

బిల్లెంత అయిందో గొప్పగా చెప్పాలనే వుంది నాక్కూడా. కానీ విన్నాక లతకు గుండె ఆగిపోదని గ్యారంటీ ఏమిటి ?

"డియర్ బాయ్స్ అండ్ గర్ల్స్....మనం యిప్పుడు మహాబలిపురం వెళ్ళేరోడ్డు మీద వున్నాం"

"హిపిప్‌హుర్రే ...నాన్నకు జై"

ఆనందపారవశ్యంతో అరిచేరు పిల్లలు. వాళ్ళకు మహాబలిపురం చూడాలన్న సర్దా వున్నదని నాకు తెల్సు. ఎన్నో సార్లు నన్నడిగేరు. కాని కారే ఎక్కించని నేను వాళ్ళకు మహాబలిపురం ఎలా చూపగలను ? ఇవాళైనా మొదట్లో అనుకొన్నానా ? ఇపుడైనా కేవలం పిల్లల కోరిక తీర్చటమే తన వుద్దేశ్యమా ? కాదు. కారులో సిటీలో తిరగటం ప్రమాదం. అందుకే మహాబలిపురానికి పారిపోవటం.

"ఏమండీ వాళ్ళకి తెలిస్తే కష్టమేమో! యిక చాలు. ఇంటి కెళ్దామండీ" లత నాతో నిదానంగానే అంది. పిల్లలు మా సంభాషణను పట్టించుకొనే స్థితిలో లేరు.

అనుకోకుండానే నా నోటి వెంట చిత్రమైన ధ్వనితో నవ్వు వెలువడింది.

"అవన్నీ యివాళ మనం ఆలోచించవద్దు లతా. లెటజ్ ఎన్‌జాయ్ టుడే" లత సంతోషాన్ని భగ్నం చేయటం యిష్టం లేక అన్నానే కాని, కారు వెళ్తుంటే, గుర్తులు వెనుక మంచి తరుముకొచ్చి నన్ను చుట్టుముట్టేయి.

నున్నటి తారు రోడ్డు మీద కారు వెళ్ళిన గుర్తులు కన్పించక పోవచ్చు. కన్పించినా కావాలనుకొంటే తుడిచేయవచ్చు. కానీ జీవితంలో గుర్తులు గుండెల మీద హత్తుకుపోయాయే! చెరిపెయ్యటం నా తరమా?

* * *

చిన్నప్పుడు నా పర్సనాలిటీని పొగుడుతూ నేను పెద్దయితే సినిమా ఏక్టరు నవుతానని అంటుండేవారంతా. వయసుతోపాటు గర్వం పెరిగింది. సినిమా ఏక్టరయినట్లే పోజులు వేసేవాడిని. అక్షరం ముక్క అబ్బలేదు. కాయకష్టానికి అసలు అలవాటు పడలేదు.

"అక్కినేని నాగేశ్వరరావు ఏం చదివేడోయ్? సినిమా ఏక్టరు కావటానికి చదువెందుకో?"

సినిమా పుస్తకాలు అమ్మి సినిమాలు చూడటమొక్కటే నాకు చాతనయిన విద్య. నా అందాన్ని చూచి ఎవరో సినిమాల్లోకి లాక్కుపోయి హీరోని చేస్తారన్న ఆశను మాత్రం ఆకలి కూడా చంపలేకపోయింది. ఆ ఆశతోనే మద్రాసు చేరాను. సినిమా స్టూడియోల గోడలు, కారుల్లో వెళ్ళే సినిమా వాళ్ళ మొహాల్ని దూరం నుంచి చూచి చూచి విసిగేసింది. చేతులు కాల్చుకొన్నాక నా తెలివి తక్కువతనానికి ఎంత విచారించి ఏం లాభం?

ఆ స్థితిలో వేలాయుధం పిళ్లైతో పరిచయం కావటం నా అదృష్టం.

వేలాయుధం సినిమా మనిషే. ఓ సినిమా కంపెనీ ఔట్‌డోర్ యూనిట్ వ్యాన్‌కు డ్రైవరు. తన దగ్గరే క్లీనర్ వుద్యోగం యిప్పించాడు. డ్రైవింగ్ కూడా నేర్పించాడు.

నాకు తెలుగు తప్ప మరో భాష తెలీదు. వేలాయుధానికి తమిళం, మలయాళం, ఇంగ్లీషు భాషలు వచ్చినా ఎంత ప్రయత్నించీ తెలుగు మాత్రం నేర్చుకోలేకపోయాడు. ఔట్‌డోర్ షూటింగులకు తెలుగు దేశం పోయినపుడు తెలుగు భాష రాక యిబ్బందిగా వుంది. అందుకని క్లీనర్‌గా నన్ను వేసుకొన్నాడు. పైగా వయసొచ్చింది వేలాయుధానికి. వోపిక తగ్గి

పోయింది. నాలాంటి కుర్రాడిని చేరదీయటం చేదోడుగా ఉంటుందని భావించాడు. అందుకే నాకు డ్రైవింగు లైసెన్సు కూడా యిప్పించాడు. క్లీనర్ పని, డ్రైవరు పని కూడా చేస్తూ అతని అభిమానం సంపాదించాను.

నేను తెలుగులో మాట్లాడితే వేలాయుధం తమిళంలో మాట్లాడేవాడు. అయినా ఒకరి భావం మరొకరికి అర్థమయ్యేది. క్రమంగా అతని ద్వారా నాకు తమిళ భాషలో కొన్ని ముక్కలు, అతనికి తెలుగు ముక్కలు కొన్ని వంటబట్టేయి.

ఔట్‌డోర్ షూటింగు నిమిత్తం తెలుగుదేశం వెళ్తున్నది యూనిట్. తెల్లవారేసరికి గోదావరి తీరంలోని ఓ పల్లెకు చేరుకోవాలి. తెలుగు తెలిసినవాడిని నేనున్నానని మా వేన్‌ను ముందు పొమ్మన్నారు. వేన్‌లో వివిధ శాఖలకి చెందిన అసిస్టెంటులున్నారు. అంతా నిద్ర పోతున్నారు.

అర్ధరాత్రి దాకా తను డ్రైవ్ చేసి, స్టీరింగు నాకు అప్పజెప్పి నిద్ర పోయాడు వేలాయుధం. ప్రయాణం ట్రంక్‌రోడ్డు మీద సాగినంత వరకు యిబ్బందేం లేకపోయింది నాకు. మెయిన్‌రోడ్డు నుండి మేము వెళ్ళాల్సిన వూరికి చీలే చోట రెండు రోడ్లున్నాయి. ఏ రోడ్డు ఏ వూరు పోయేది సూచిస్తూ బోర్డు వుంది. కానీ నాకు అక్షరాలు చదవటం వస్తేగా ? ఎవరినైనా లేపి అడగటానికి సిగ్గేసింది.

ధైర్యం చేసి ఓ రోడ్డు పట్టించాను. నా అదృష్టం బాగా లేదు. అది మేం వెళ్ళాల్సిన వూరుకెళ్ళే రోడ్డు కాదు.

ఒరేయ్ ! ఎద్దులా వుంటే కాస్తంత చదువుకొన్నావనుకొన్నాను. హీరోలా వొట్టి పోజులేనా ? అక్షరం ముక్కరాదా ? విద్యలేనివాడు వింత పశువురా. చూశావుగా ఏం జరిగిందో ? యికనైనా నేర్చుకో" అంతకన్నా నన్నేం అనలేదు వేలాయుధం. అయితే అప్పటి నుంచి వేలాయుధం నన్ను స్టీరింగు ముందు కూర్చోనివ్వలేదు.

చిన్నతనంలో నా పొగరుమోతుతనాన్ని తల్చుకొని ఏడిచాను. ఏడుపులో నుంచి పట్టుదల పెరిగింది. త్వరలోనే తెలుగు, తమిళం, ఇంగ్లీషు అక్షరాలతోసహా నేర్చుకొన్నాను.

"నా మాటలకు కోపం తెచ్చుకొంటావనుకొన్నా. పట్టుదల పెంచుకొన్నందుకు సంతోషంరా. వొక ప్రొడ్యూసర్‌గారికి డ్రైవరు కావాలిట. వెళ్తావా ?"

వేలాయుధం నా పాలిట దేముడు. అతని మాట నాకు శిలాశాసనం?

"ఒరేయ్, డ్రైవరుకు మూగతనం గొప్ప వరం. సినీ ప్రపంచంలో యిదో గొప్ప క్వాలిఫికేషన్. ఆకర్షణలకు లొంగకు. నీతిని వదలకు. నీ భ్రమలు తల్లక్రిందులవుతే ఆశ్చర్యపోకు. అసహ్యించుకోకు. ఈ ఫీల్డు శాశ్వతమని నమ్మకోకు. మంచిఛాన్సు మరోచోట వస్తే వెళ్ళి స్థిరపడు."

వేలాయుదం మాటల్లో సత్యాల్ని తెల్సుకోటానికి నాకు ఎంతో కాలం పట్టలేదు. చూచాను. ఎందరో నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, టెక్నీషియన్లతో పరిచయమయింది. నా భ్రమలు తొలగిపోయాయి. మెరిసేదంతా బంగారం కాదు. ధనం వున్నవాళ్ళంతా సుఖంగా వుంటారన్న రూలు లేదు. మనిషి ఎలా బ్రతకూడదో నేర్చుకొన్నాను ?

శిఖరాన్ని చేరుకొన్న రామ్‌దేవ్ వొక్కసారి కాలుజారి అగాధంలో పడిపోయాడు. వెన్నుపూస విరిగిపోయింది.

ఆ సంతటితో పాటు కారు అమ్మేసేడు. సినిమా ఫీల్డులోనే వుద్యోగం కావాలనుకుంటే సంపాదించుకోగలను. కానీ నేను అప్పటికి పెళ్ళి చేసుకున్నాను. పిల్లలూ పుట్టేరు. జీవితంలో భద్రత అవసరం గుర్తించాను.

గురుమూర్తిగారి ఇండస్ట్రీలో వుద్యోగం చిక్కింది. పర్మనెంటు వుద్యోగం. క్రమంగా గురుమూర్తిగారి స్వంత కారు డ్రైవరు నయ్యాను. డ్రైవర్లకు అది గొప్ప ప్రమోషన్‌కిందలెక్క !

గురుమూర్తిగారిది అమెరికా నుంచి ఇంపోర్టెడ్ కారు. లేటెస్ట్ టెక్నిక్. అన్ని కంఫర్ట్స్ వున్నకారు. గురుమూర్తిగారి ఆరో ప్రాణం. బిజి నెస్‌కు సంబంధించిన గొప్పగొప్ప ఐడియాస్ అన్నీ ఆయనకు ఆ కారులో ప్రయాణం చేస్తుండగానే వస్తుంటాయి. అంచేత ఆ కారు డ్రైవరు ఆయన చిత్తాన్ని, మూడ్‌ను కనిపెట్టి డ్రైవ్ చేయగల నేర్పుగల వాడయి వుండాలి. మిగతా డ్రైవర్లకన్నా ఆకారు డ్రైవరుకు ఎక్కువ జీతం, అల వెన్సులూ యిస్తారు. అసలు ఆ కారు డ్రైవ్ చేయటంలోనే ఓగొప్ప థ్రిల్ వుంది!

గురుమూర్తిగారు ఎంత మితభాషులో ఆయన భార్య అంత అతి భాషిణి. ఆమెకు సినిమాలంటే తగని పిచ్చి. నేను సినిమా కంపెనీలో పని చేసేనని తెల్సి సినిమా వాళ్ళ కబుర్లు చెప్పించుకొని వినేది. అలా ఆమె అభిమానాన్ని సంపాదించుకొన్నాను.

అయితే వస్తుతః ఆమెది అనుమాన స్వభావం. ఇంట్లో పనిచేసే వాళ్ళని ఒకరి పైన ఒకర్ని పత్తేదార్లుగా వాడుకొంటుంది. ఆ కారును నేను ఎక్కడ స్వంతానికి తిప్పుకొంటున్నానోనని ఆమె భయం. నా మీద పత్తే దార్లని పెట్టిందని నాకు తెలుసు.

కానీ సినిమా ఫీల్డులో వుండగానే రామ్‌దేవ్ కారులో నా భార్యా పిల్లల్ని ఎక్కించలేదు. వాళ్ళనొక్కసారి సినిమా షూటింగుకు తీసికెళ్ళ లేదు. ఇక ఇంపోర్టెడ్ కారును నా స్వంతానికి వాడుకుంటానా?

అయితే పిల్లలు ఒకటే గోల. వాళ్లు ఆ కారును గురించి విన్నారు. దూరంనుంచి చూసేరు. ఒక్కసారి ఆ కారు ఎక్కాలన్న ఉబలాటం సహజమేగా?

క్రమంగా ఉబలాటంతోపాటు నామీద వత్తిడి ఎక్కువయింది.

"రైల్లో బొగ్గేసేవాడు పెళ్ళాం, పిల్లల్ని వుచితంగా ఫస్ట్‌క్లాస్‌లో

తీసుకెళ్తున్నాడు. హోటల్‌లో సర్వర్ భార్యా పిల్లలకి వారానికొకసారైనా హోటల్‌లో పదార్థాలు రుచిచూపిస్తాడు. లారీ డ్రైవర్లు డబ్బు తీసుకోని ప్రయాణీకుల్ని ఎక్కించుకొంటున్నారు. ఏ వుద్యోగం చేసేవాడు ఆ వుద్యోగంలో సౌకర్యాలను భార్యా పిల్లలకి కల్పించటంలేదూ ? అందాకా ఎందుకు ? కారు డ్రైవర్లంతా మీలాగే వున్నారా? ఏమిటో దేనికైనా పెట్టి పుట్టాలి. ఆ పార్వతమ్మ మొగుడు సినిమాహాల్లో గేట్‌కీపర్. అయితేనేం? పిల్లల్తో ప్రతి సినిమా టిక్కెట్టు లేకుండా హాయిగా చూసొస్తుంది. నా మొగుడు పేద్ద అమెరికా కారు తోలుతాడని పేరు. ఆ కారు చక్రాలు ముట్టుకోటానిక్కూడా అర్హతలేదు మాకు"

పెళ్ళయ్యాక యిన్ని మాటలు ఒక్కసారి మాట్లాడి ఎరుగదు లత. ఇంత నిష్టూరంగా మాట్లాడిందంటే మనసులో ఎంత అసంతృప్తి, బాధ పేరుకొని వుండాలి ? ఆలోచిస్తే లత "రీజనింగ్" నాకు నచ్చింది. తెగింపు వచ్చింది. అవకాశమూ ఆ వెంటనే వచ్చింది.

ఎవరో అతిథులొస్తే వారి కారులో మూర్తిగారు కుటుంబ సమేతంగా ఎక్కడికో వెళ్ళారు. కారు తాళం చెవి నా దగ్గరే వుంది. ఈ రెండూ ఒనగూడటం ప్రాప్తమే !

కాస్సేపు పెళ్ళాం, పిల్లల్ని కారెక్కించి తిప్పి సర్దా తీరుద్దామనుకున్నాను. కానీ యిప్పుడు నేను చేస్తున్నదేమిటి ? ఎటుపోతున్నాను నేనిప్పుడు ?

చూడాలన్న వుబలాటమే కానీ శిల్ప సౌందర్యాన్ని పిల్లకుంకలేం ఆనందించగలరు ? చూడటానికి ముందున్న వుత్సాహం చూచేటప్పుడు వారి మొహంలో నాకు కన్పించలేదు. సముద్రంలోకి వున్న షోర్‌టెంపుల్ వాళ్ళను ఆకట్టుకుంది.

"ఇక చాల్లెండి. యింటికెళ్దాం పదండి"

పిల్లలు కూడా తల్లి ప్రతిపాదనకు విముఖత్వం చూపలేదు.

లత, పిల్లలు కారు ఎక్కారు. నేను డోర్ తెరుస్తున్నాను.

"ఆ కారుల్లో వాళ్ళెవరో మనల్నే చూస్తున్నారండీ"

స్టీరింగ్ ముందు కూర్చుని లత చూపించిన కార్లవైపు చూశాను. పట్టుబడ్డ దొంగ స్థితి నాది !

రెండు కారుల్లో మనుషుల కళ్ళన్నీ నా వైపే కేంద్రీకరించబడి వున్నాయి. పులి కళ్ళు. తోడేలు కళ్ళు, పిల్లి కళ్ళు, నక్క కళ్ళు, ఏనుగు కళ్ళు.... ఒక్కొక్కంటి ద్వయం వెనుక ఒక్కో జంతువు.

అన్ని కళ్ళని తప్పించుకొని అసలు కళ్ళలోకి చూశాను. ఆ కళ్ళ వెనుక శూన్యం వుంది. కానీ కళ్ళకింద వున్న పెదిమలు నవ్వుతున్నాయి.

కారు డోరు తెరుచుకొని దిగబోతున్నాను. రెండు కార్లు కదిలి పోయాయి.

"ఎవరండీ వాళ్ళు ?" అనుమానంగా అడిగింది లత.

"నాకు తెలిసిన సినిమా వాళ్ళు" కారు స్టార్ట్ చేసేను.

ఒక్క వెధవ నిజం చెప్పి నా భార్యా పిల్లలు పొద్దున్నుంచి పొందిన ఆనందాన్ని తృప్తిని అపహరించటం నాకిష్టంలేదు.

* * *

మర్నాడు గురుమూర్తిగారు తిరిగి వచ్చిందాకా ఆ నవ్వు నన్ను వెంటాడుతూనే వుంది.

నవ్వు సంతోషానికి, ఆనందానికి చిహ్నమంటారు. కానీ అన్ని నవ్వులూ ఆనందానికి చిహ్నాలు కావని నేను అనుభవంలో నేర్చుకొన్నాను.

నిన్న ప్రొద్దున నా పిల్లల మొహంలో మెరిసిన నవ్వులు ఆరోగ్య చిహ్నాలు, ఆనందతోరణాలు ! కాని నన్ను వెంటాడిన నవ్వు వెనుక

కోపం, పగ దాగివున్నాయి. ఆ నవ్వు ఎదుటివాడిని ఏడిపించటానికి, భయ పెట్టి చంపటానికి వుద్దేశించబడ్డ బ్రహ్మాస్త్రాలు ! గొర్రెల్ని చంపే ముందు పులి యిలాగే నవ్వుతుందేమో !

అయినా నేను భయపడలేదు. నిజం చెప్పి నేను చేసిన తప్పుకు శిక్ష అనుభవించాలనే నిర్ణయించుకొన్నాను.

"ఎక్స్క్యూజ్ మి సర్" అని తాళంచెవి గురుమూర్తిగారికిస్తూ జరిగిందంతా అక్షరం పొల్లు పోకుండా చెప్పాను. జడ్జిమెంటును మర్నాటికి వాయిదా వేశారు ఆయన.

నిన్న రాత్రి నిద్రలేదు. ఇవాళ రాత్రి వుండదనుకొన్నాను.

కానీ మనసు నిశ్చింతగా వుంది. హాయిగా నిద్రపోయాను.

దొంగ అనుభవించే శిక్ష, నిజాయితీపరుడు అనుభవించే సుఖం యీ రెంటికీ మధ్యనున్న వ్యత్యాసం తెల్సివచ్చింది. దొంగతనంగా అనుభవించే సుఖంకన్నా నిజాయితీ కోసం కష్టపడటంలో ఆనందంవుందా ?

"ఈ విశ్వంలో సకల జీవుల కార్యక్రమాలను నిర్దేశించే మహత్తర శక్తి కుటుంబం. కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, శ్రేయస్సు ఆ కుటుంబ పెద్ద బాధ్యతే ! ఆ దృష్ట్యా నువ్వు చేసినపని తప్పు కాదు. అయితే ఎవరి కుటుంబ సౌఖ్యంకోసం ఎవరికి వారు అడ్డుదోవలు తొక్కేరనుకో, అరాచకమేగా ? నిజమే. నీ భార్య అన్నట్లు ఏయే వృత్తుల్లో, వుద్యోగాల్లో వున్నవాళ్ళు, ఆయా వుద్యోగాలద్వారా సంక్రమించే సుఖాలను తమ భార్యాపిల్లలకు యిస్తున్నారు. ఇవ్వటం ధర్మం కూడా. కానీ అవినీతి మార్గంలో దొంగతనంగా పొందిన సుఖం నిజమైనసుఖమా ? లేక ఆ సుఖం పొందటం హక్కుగా భావించి న్యాయసమ్మతం చేసుకొని రాజమార్గంలో ఆ సుఖాన్ని పొందటంలో నిజమైన సుఖంవుందా ? నీ అనుభవం నీకు నేర్పి వుండాలి. ఇవాళనుంచి కారు నెలకొక రోజు నీ భార్యాపిల్లల నిమిత్తం

వుపయోగించుకోటానికి నీకు అనుమతి ఇస్తున్నాను. కారు మాత్రమే వుచితం. పెట్రోలు ఖర్చులు, తదితర ఖర్చులు నీవే"

ధనవంతులంతా దుర్మార్గులన్న నా అభిప్రాయాన్ని మార్చుకోక తప్పలేదు. వారు దుర్మార్గులు కాదు. దుర్మార్గపు తెలివితేటలున్న మంచి వారు !

కాకపోతే ఏమిటి ? కారు ఓ రోజు మైన్‌టైన్ చెయ్యటానికి ఎంత ఖర్చవుతుందో నాకుతెల్సు. ప్రతి నెలా కేవలం సర్దాకోసం అంతఖర్చు పెట్టేశక్తి నాకు లేదని గురుమూర్తిగారికి తెల్సు ! కనుక-ఏనుగును దానం చేయబోయిన ఖ్యాతి ఆయనకు, నిరాకరించానన్న అపఖ్యాతి నాకూ తప్పదు.

అయినా నాకు దిగుల్లేదు.

ఎందుకంటే ఏనుగుకన్నా, ఇంపోర్టెడ్ కారుకన్నా శాశ్వత విలువ గల సత్యాన్ని నేనూ, నా భార్యా ఆ కారు అనుభవంతో తెల్సుకొన్నాము గనుక !

(విపుల మాస పత్రిక-జూలై 1981)